## క్లుప్తంగా

### నేడు డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాలు

**యలమంచిలి రూరల్:** స్వయం ప్రతిపత్తి హోదా దక్కిన తర్వాత యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత నెలలో నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలు గురువారం విడుదల చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 2 నుంచి 9వ తేదీ వరకు బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులు చదువుతున్న సుమారు 311 మంది విద్యార్థులకు అటానమస్ హోదాలో మొదటి సెమిస్టర్ థియరీ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల నియంత్రణ అధికారి పర్యవేక్షణలో జవాబు పత్రాల మూల్యాంకనం అనంతరం ఫలితాలు సిద్ధం చేశారు. ఈ ఫలితాలను కళాశాల ఐక్యూఏసీ విభాగంలో గురువారం ఉదయం 11 గంటలకు విడుదల చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

### సంపద తయారీ కేంద్రాల సందర్శన


వర్మీ కంపోస్టును పరిశీలిస్తున్న ఈవోఆర్డీ చంద్రశేఖర్

**పాయకరావుపేట:** మండలంలోని మంగవరం, నామవరం, అరట్లకోట గ్రామాల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఈవోఆర్డీ సిహెచ్.చంద్రశేఖర్ సందర్శించారు. ఈ మూడు గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్వహణలో ఉన్నట్లుగా గుర్తించారు. నామవరంలో వర్మీకంపోస్టు విక్రయాలు రూ.3,100, మంగవరంలో రూ.780 విక్రయాలు, అరట్లకోట గ్రామంలో రూ.800 వర్మీ విక్రయాల మొత్తాలను జీపీజీఎఫ్‌కు జమ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు ఆచారి, కొండలరావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

### పోషకాహారం శ్రేయస్కరం

**మునగపాక:** పోషక విలువలతో కూడిన ఆహారం శ్రేయస్కరమని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బుధవారం పంచాయతీ పరిధిలోని గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఆయన కోడిగుడ్లు, పప్పు దినుసలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. గర్భిణులు తాజా ఆహారంతో పాటు తేలికగా జీర్ణం అయ్యే ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

### నేడు అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

**ఎస్.రాయవరం:** గోకులపాడులో శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం జరగనుంది. ఈ మేరకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో రెండు రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. స్వామికి గురువారం వేకువజాము నుంచి కుంకుమ, తమలపాకు పూజలు నిర్వహించనున్నట్టు సభ్యులు తెలిపారు.

### పారిశుధ్యం మెరుగుకు చర్యలు


కాలువలపై పలకలు ఏర్పాటు చేస్తున్న పాలకవర్గ సభ్యులు

**మునగపాక:** పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకుంటున్నామని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి అన్నారు. గ్రామంలో దోమల బెడద లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామంలోని కాలువల ద్వారా వచ్చే దుర్వాసన తగ్గించేందుకు బుధవారం పలకలు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలువల్లో ఎప్పటికప్పుడు పూడిక తీతకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు కూడా గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు.

### పిల్లల సమగ్ర అభివృద్ధికి చర్యలు


మాట్లాడుతున్న హెచ్‌ఎం జీవన్

**కోటవురట్ల:** అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు ప్రాథమిక విద్యపై ఆసక్తి పెంచేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని హెచ్‌ఎం జీవన్ తెలిపారు. గొల్లపేట అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ ఎస్తేరురాణి ఆధ్వర్యంలో ఈసీసీఈ (ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్) కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పిల్లలు సమగ్రంగా అభివృద్ధి చెందేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. శారీరక, అభిజ్ఞా, సామాజిక, భాషా అభివృద్ధి లక్ష్యంగా పిల్లలను తీర్చిదిద్దుతున్నారన్నారు. ఈ కార్యక్రమం ప్రతి నెల 5న జరుపుతారని, పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

- తగ్గిన రూ.10, రూ.20 నోట్ల చలామణి
- మార్కెట్లో వ్యాపారులు, ప్రజల ఇబ్బందులు
- చిల్లర కొరతతో తప్పని తిప్పలు

# చిన్న నోటు పెద్ద కష్టం




**యలమంచిలి రూరల్:** పది రూపాయల నోటు చిన్నదే అయినా ప్రతి ఒక్కరికీ చాలా అవసరం. ప్రస్తుతం మార్కెట్‌లో వాటి చలామణి తక్కువగా ఉండటంతో అన్ని వర్గాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కన టీ స్టాల్‌లో టీ తాగాలన్నా.. పానీ పూరీ తినాలన్నా, మార్కెట్లో కూరగాయలు, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసి షాపు యజమానికి డబ్బులు చెల్లించడానికి, తిరిగి వారు చిల్లర ఇవ్వడానికి ఇటు ప్రజలు, అటు వ్యాపారస్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్నాళ్లుగా రూ.10, రూ.20, రూ.50 నోట్ల లభ్యత తగ్గింది. దీంతో చిల్లర కష్టాలతో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. చలామణిలో చిరిగిన, బాగా దెబ్బతిన్న రూ.10 నోట్లు తప్ప కొత్తవి రావడం లేదు. ప్రస్తుతం మార్కెట్లో చలామణిలో ఉన్న రూ.10 నోట్లు జేబులో పెట్టుకుంటే చిరిగిపోయే పరిస్థితులు ఉన్నాయి. నిరక్షరాస్యులైన వ్యాపారులు, సామాన్య ప్రజలు చిరిగిపోయిన పది నోట్లను తీసుకునేందుకు ఇష్టపడకపోవడంతో అన్ని వర్గాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 10 రూపాయల నాణెం ఉన్నా పెద్దగా చలామణిలో లేదు.

### డిజిటల్ చెల్లింపులతో ఊరట

ఇప్పటికే కొంత మేరకు అన్ని వ్యాపార సంస్థల్లో డిజిటల్ చెల్లింపులు వినియోగంలో ఉన్నాయి. బస్సుల్లో ప్రయాణించేటప్పుడు యూపీఐల ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయి. అయితే కొన్నిసార్లు కండక్టర్ వద్ద ఉండే ఆర్టీసీ యాప్ సక్రమంగా పనిచేయడం లేదని, ఆ సమయంలో చిల్లర సమస్య వేధిస్తోందని ప్రయాణికులు చెబుతున్నారు. పది రూపాయల నోట్ల కొరతతో కొందరు ముందు జాగ్రత్తగా ఆ నోట్లను భద్రపరుచుకుంటున్నారు. ఈ కారణంగా కూడా కొరత మరింత ఎక్కువవుతోంది. బ్యాంకుల ద్వారా రూ.10 నోట్లను ఎక్కువగా విడుదల చేసి చిల్లర కష్టాలను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు రూ.10 నాణేల వినియోగంలో ఇంకా ప్రజలు, వ్యాపారుల్లో ఉన్న అనుమానాలు, అపోహలను బ్యాంకు అధికారులు పోగొట్టి వాటిపై అవగాహన కల్పించాల్సిన అవసరం కూడా ఉంది.




### రూ.10నోట్ల కొరత ఉంది



యూపీఐ పేమెంట్లు చేసే అవకాశం లేని వారు, ముఖ్యంగా వృద్ధులు, హైస్కూల్ విద్యార్థులు, నిరక్షరాస్యులు రూ.100, రూ.200, రూ.500 నోట్లను ఇస్తుంటారు. వారికి తిరిగి చిల్లర ఇవ్వడానికి తీవ్ర ఇబ్బందవుతోంది. రూ.10 నోట్లు కొరతతో పాటు చలామణిలో ఉన్నవి కూడా బాగా పాతవి, చిరిగినవి ఉంటున్నాయి. వీటిని తీసుకోవడానికి ఎవరూ ఇష్టపడడం లేదు. రూ.10 నోట్లు కొత్తవి బ్యాంకుల ద్వారా విడుదల చేస్తే సమస్య పరిష్కారమౌతుంది.
–చెక్కా పరమేష్, శివ ఎంటర్ ప్రైజెస్ దుకాణం నిర్వాహకుడు

### చిల్లరలేదని పెన్ను ఇవ్వలేదు..



ఇటీవల పెన్ను కొనుగోలు చేయడానికి పట్టణంలో దుకాణానికి వెళ్తే రూ.50 నోటు ఇస్తే చిల్లర లేదని పెన్ను ఇవ్వడానికి దుకాణ యజమాని నిరాకరించారు. ఆటో ఎక్కినప్పుడు కూడా ఇదే పరిస్థితి. చిల్లర కొరత కారణంగా అందరూ ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పది రూపాయల నోట్లను విరివిగా చలామణిలో ఉంచాలి.
– కన్నం అశ్వని, డిగ్రీ విద్యార్థిని, కొత్తూరు

### పట్టణంలో తీవ్ర కొరత

యలమంచిలి పట్టణంలో చిరు వ్యాపారులు, చిన్నపాటి హోటళ్లు, టీ కొట్లు, ఆటోలు, బస్సుల్లో రూ.10 నోట్ల వినియోగం ఎక్కువగా ఉంటోంది. అందుకు తగిన విధంగా ఆ నోట్లు అందుబాటులో లేకపోవడం కష్టంగా ఉందని ప్రజలు చెబుతున్నారు. పట్టణంలో వివిధ రకాల వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. చాలా దుకాణాల్లో ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, వంటి ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించే పద్ధతి ఉన్నా, సామాన్య ప్రజానీకం ఎక్కువగా వీధి వ్యాపారులు, రైతుల వద్ద కొనుగోలు చేసే కూరగాయలు, చిన్న చిన్న వస్తువుల కోసం చిల్లర సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో పలు చోట్ల రూ.100 నోటును ఇస్తే తిరిగి చిల్లర ఇచ్చేందుకు వ్యాపారులు నానా తంటాలు పడుతున్నారు. అయితే చిల్లర కష్టాలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లో ఎక్కువగా ఉంటోంది.




### రోజు వారీ కొనుగోళ్లకు ఇబ్బందులు



మార్కెట్లో పది రూపాయల నోట్ల కొరత తీవ్రంగా ఉంది. చలామణిలో ఉన్న పది రూపాయల నోట్లు కూడా బాగా చిరిగిపోయినవే ఉంటున్నాయి. రోజువారీ కొనుగోళ్లకు సంబంధించి పది రూపాయల నోట్ల అవసరం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా ఫుట్‌పాత్ వ్యాపారుల వద్ద కొనుగోళ్లకు చిన్న నోట్ల కొరత ఇబ్బందులు కలిగిస్తోంది. వారి వద్ద యూపీఐ పేమెంట్లకు అవకాశం ఉండదు. ఇటీవల ఒక టిఫిన్ షాపు వద్ద అల్పాహారం తిన్న తర్వాత దుకాణం వద్ద రూ.30 చెల్లించడానికి యూపీఐ పనిచేయలేదు. చిల్లర కొరతతో ఇబ్బంది తలెత్తింది. సుమారు గంటసేపు వేచి చూడాల్సి వచ్చింది.
– బండారి కరుణ, ప్రైవేట ఉద్యోగి, యలమంచిలి

## వైఎస్సార్‌సీపీ 'యలమంచిలి' అనుబంధ విభాగాల అధ్యక్షుల ప్రకటన

**అచ్యుతాపురం:** వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు యలమంచిలి నియోజకవర్గానికి పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షుల్ని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. యువజన విభాగం అధ్యక్షునిగా శరగడం జగ్గారావు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా రాజాన చిట్టమ్మ, రైతు విభాగం అధ్యక్షుడిగా తేటకాలి సత్యనారాయణ, బీసీ సెల్ అధ్యక్షుడిగా బొడ్డేడ చెల్లయ్యనాయుడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మందా రాము, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా మట్టా చిన్నయ్య, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా మహ్మద్ గౌస్, క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా మట్టా అప్పలనాయుడు, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా చదరం అప్పలనాయుడు నియామకమయ్యారు. పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడిగా బలిరెడ్డి శ్రీను, మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా అశ్రిపు గుప్తా, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడిగా యాకా అప్పలరాజు, వలంటీర్ విభాగం అధ్యక్షుడిగా సారిపల్లి పైడిరాజు, గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడిగా బోడిపల్లి దేముడు, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా కట్టమూరి నారాయణ మూర్తి, వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా తేలు వెంకటేశ్వరరావు, వైఎస్ఆర్‌టీయూసీ అధ్యక్షుడిగా సుందరపు నీలకంఠ స్వామి, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షుడిగా పల్లెల సూర్య ప్రకాశ్‌రావు, లీగల్ సెల్ అధ్యక్షుడిగా లాలం వెంకట రామకృష్ణారావు, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా మల్ల బాపునాయుడు, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా పోలవరపు రమణ ప్రసాద్, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా చేకూరి రామరాజు, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా ఆర్.రాము, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా కొరివి రామకృష్ణ, ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడిగా పిట్టా చిన మంగారెడ్డి, బూత్ కమిటీల విభాగం అధ్యక్షుడిగా దూడి నర్సింహమూర్తి నియమితులయ్యారు. మొత్తం 26 విభాగాలకు చెందిన అసెంబ్లీ స్థాయి అధ్యక్షుల వివరాలు కేంద్ర కమిటీ కార్యాలయం నుంచి విడుదల అయ్యాయి.

## ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు


అచ్యుతాపురం హైస్కూల్ వద్ద అనుమానంగా సంచరిస్తున్న వారిని ప్రశ్నిస్తున్న సీఐ గణేశ్

**అచ్యుతాపురం:** పాఠశాలలు, కళాశాలల వద్ద ఈవ్‌టీజింగ్ పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ గణేశ్ హెచ్చరించారు. అచ్యుతాపురం మండలంలోని పాఠశాలలు, కళాశాలల వద్ద సీఐ గణేష్‌తో పాటు, పోలీసులు మఫ్టీలోనూ, యూనిఫాంలోనూ అపరిచిత వ్యక్తుల సంచారంపై నిఘా ఉంచారు. అనుమానంగా సంచరిస్తున్న ఐదుగుర్ని విచారించారు. విద్యార్థులతో మాట్లాడి ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారి వివరాలను తెలుసుకున్నారు. ఆయా విద్యా సంస్థల పరిసరాల్లో సంచరిస్తున్న అపరిత వ్యక్తులను ప్రశ్నించారు. ఎక్కడైనా ర్యాగింగ్, టీజింగ్ జరిగితే విద్యార్థులు సమాచారం ఇస్తే వెంటనే కఠినంగా చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

## జనరాజ్ దాస్ సేవలు మరువలేనివి


జనరాజ్‌దాస్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, తదితరులు

**మునగపాక:** మునగపాక గ్రామాభివృద్ధికి ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ పెంటకోట జనరాజ్ దాస్ అందించిన సేవలు మరువలేనివని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ అన్నారు. మునగపాక గ్రామీణ యువజన మందిరం వద్ద బుధవారం దివంగత జనరాజ్‌దాస్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ మునగపాకలో విద్యుత్ సబ్‌స్టేషన్, పీహెచ్‌సీ, పీఏసీఏస్ వంటి భవనాలు జనరాజ్‌దాస్ హయాంలో అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సూరిశెట్టి రాము, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు దాడి ముసిలినాయుడు, టెక్కలి కొండలరావు, పాల సంఘం అధ్యక్షులు మళ్ల సంజీవ రావు, రంగ స్థల నటులు పెంటకోట సత్యనారాయణ, మళ్ల కృష్ణ, ఎంఎం నాయుడు, ఎంపీహెచ్ఈవో సూరిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నామవరంలో 'పొలం పిలుస్తోంది'


క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

**పాయకరావుపేట:** మండలంలోని నామవరం గ్రామంలో బుధవారం ఏడీఏ ఉమాప్రసాద్ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉమాప్రసాద్ మాట్లాడుతూ ఎన్‌పీఎస్ఎస్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్, వ్యవసాయ పథకాల గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ రబీ పంట ఈకేవైసీ 100 శాతం పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులు ప్రభుత్వం ఇచ్చే కనీస మద్దతు ధరపై ధాన్యం అమ్ముకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ శ్రావణ్ కుమార్, వీహెచ్ఏలు రమ్య, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్ చట్టాలు రద్దు చేయాలి



లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా రాంబిల్లిలో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

**యలమంచిలి రూరల్:** కేంద్ర ప్రభుత్వం కార్మికులకు ఇబ్బంది కలిగించే నాలుగు లేబర్ కోడ్ చట్టాలను అమలు చేయడాన్ని విరమించుకుని, తక్షణమే వాటిని రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం యలమంచిలిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ అవుట్ గేట్ వద్ద చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సీఐటీయూ నాయకులు నినాదాలు చేశారు. గతంలో ఉన్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్పొరేట్లకు అనుకూలంగా ఉండేలా కొత్త చట్టాలను ఎలాంటి చర్చ లేకుండా నాలుగేళ్ల క్రితం పార్లమెంటులో ఆమోదం తెలిపారన్నారు. ఇప్పుడు ఆ చట్టాల అమలుకు కేంద్ర ప్రభుత్వం చూస్తోందని సీఐటీయూ యలమంచిలి మండల కార్యదర్శి చింతకాయల శివాజీ విమర్శించారు. కేంద్రం తన నిర్ణయాన్ని విరమించుకోకపోతే కార్మిక వర్గాలతో పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జానకి, శ్రీనివాస్, వరలక్ష్మి, ప్రసన్న, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

**రాంబిల్లి(యలమంచిలి):** కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను వెంటనే కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాంబిల్లిలో సీఐటీయూ నేతలు, కార్మికులు ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఏవోబీ కార్మికులు, భవన నిర్మాణ, ఆటో, ముఠా కార్మికులు, తదితరలు పాల్గొన్నారు.



అచ్యుతాపురంలో ర్యాలీ చేస్తున్న కార్మికులు

**అచ్యుతాపురం:** కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ అచ్యుతాపురంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, మండల కార్యదర్శి సోమునాయుడు గతంలో రైతులకు నష్టం కలిగించేలా వ్యవహరించిన మోదీ ప్రభుత్వం ఇప్పుడు కార్మికులకు నష్టం కలిగించేలా చట్టాలను చేస్తుందని విమర్శించారు. లేబర్ కోడ్‌ల రద్దు కోసం కార్మిక వర్గాలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు లోకేష్, పవన్, గోవింద్, పరశురాం, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి రామాలయ పునః ప్రారంభోత్సవాలు

- తిమ్మరాజుపేటలో మూడు రోజుల పూజా కార్యక్రమాలు
- 8న విగ్రహాల ప్రతిష్ఠ


తిమ్మరాజుపేటలోని రామాలయం

**మునగపాక:** మండలంలోని తిమ్మరాజుపేటలో రామాలయం పునః ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా గురువారం నుంచి శనివారం వరకు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. గురువారం అఖండ దీపారాధన, గణపతి పూజ, హోమం, 7న గోపూజ, పారాయణం, విగ్రహాల ఊరేగింపు జరుగుతుందన్నారు. 8న వేద మంత్రోచ్ఛారణల మధ్య సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. 8న మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. భక్తులు మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలకు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

## ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు


విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

**పాయకరావుపేట:** పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధతో ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని డిప్యూటీ డీఈవో పెన్నాడ అప్పారావు అన్నారు. మండలంలోని పెదరాంభద్రపురం, రాజానగరం గ్రామాల్లో 10వ తరగతి విద్యార్థులకు శత శాతం ఉత్తీర్ణత సాధన ప్రణాళికలో భాగంగా ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న స్టడీ సెంటర్లను బుధవారం ఆయన సందర్శించారు. దీనిలో భాగంగా ఆయన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పరీక్షలు ముగిసే వరకు టీవీలకు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలని, ఇంటిలో చక్కగా చదువుకునేలా సానుకూల పరిస్థితులు కల్పించాలని, మంచి పోషకాహారం అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కోడి శ్రీనివాసరావు, షేక్ కోదండరాం రహీమ్, మండల విద్యాశాఖాధికారి-2 జి.రమేష్‌బాబు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పిట్టా గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## ముందుగా గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యమే


అచ్యుతాపురంలో మానవహారం నిర్వహిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు


మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

**మునగపాక:** క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడం ద్వారా మరణాలను తగ్గించవచ్చని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. బుధవారం వెలుగు కార్యాలయంలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ రాకుండా తీసుకునే జాగ్రత్తలు, వచ్చాక తీసుకునే నివారణ చర్యలపై వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు క్యాన్సర్ రాకుండా పదేపదే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ముందుగా గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యమేనన్నారు. గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించాలన్నారు. వెలుగు ఏపీవో బాలరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి, వెలుగు సీసీలు వేణు, రామకృష్ణ, శ్రీను, నాగమణి, అనురాధ, వీవోఏలు, పలు గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**రాంబిల్లి(యలమంచిలి):** రాంబిల్లి మండల కేంద్రంలో మహిళా సమాఖ్య భవనంలో క్యాన్సర్‌పై దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్ అవగాహన సదస్సు నిర్వహించారు. క్యాన్సర్ లక్షణాలు, నివారణ చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో రాంబిల్లి వైద్యాధికారి అనిల్‌కుమార్, డ్వాక్రా సిబ్బంది, రాంబిల్లి పీహెచ్‌సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**అచ్యుతాపురం:** క్యాన్సర్‌పై విస్తృత ప్రచారం ఎంతైనా అవసరమని వైద్యాధికారి శ్రావ్య అన్నారు. అచ్యుతాపురం మండల కార్యాలయంలో బుధవారం మహిళా సమాఖ్య సభ్యులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. గ్రామాల్లో వీవోఏలు సాయంత్రం పూట బాలికలకు, మహిళలకు క్యాన్సర్ లక్షణాలు వివరించాలని సూచించారు. అగనంపూడిలో ఉన్న హోమియో బాబా క్యాన్సర్ ఆస్పత్రిలో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఏపీఎం శ్రీనివాసరావు, సీసీలు శ్రీను, రమేష్, సరోజిని, సీహెచ్‌వో వేణుగోపాల్, స్టాఫ్ నర్సులు పావని, లోవ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

### క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలి

**నక్కపల్లి:** గ్రామాల్లో క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కల్పించేందుకు డ్వాక్రా సంఘాల మహిళలు, వీవోఏలు కృషి చేయాలని నక్కపల్లి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయలక్ష్మి సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళల్లో వచ్చే సర్వైకల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. క్యాన్సర్ వచ్చే ముందు కలిగే లక్షణాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు. గ్రామాల్లో ప్రచారం చేసేందుకు ప్రతి వీవోకి 50 కరపత్రాలను అందజేశారు.

## ఈ ఫ్లెక్సీలకు ఎన్నికల కోడ్ వర్తించదా?


ఆక్సాహేబుపేటలో హోం మంత్రి ఫొటోతో ఫ్లెక్సీ



అక్సాహేబుపేటలో టీడీపీ ఫ్లెక్సీ

**కోటవురట్ల:** ఎన్నికల కోడ్‌ను అధికారులు బేఖాతర్ చేస్తున్నారు. పల్లెల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు దర్జాగా దర్శనమిస్తున్నాయి. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి వారం రోజులు దాటుతున్నా పల్లెల్లో ఫ్లెక్సీలు అధికారులకు కనిపించలేదు. నిబంధనల ప్రకారం ఎన్నికల కోడ్ వచ్చిన 24 గంటల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను తొలగించి, ప్రభావితం చేసే నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలి. కానీ మండలంలో ఎన్నికల కోడ్‌ను అపహాస్యం చేస్తున్నారు. ఆక్సాహేబుపేటలో హోంమంత్రి అనిత ఫొటోలతో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను నేటికీ తొలగించలేదు. అధికార పార్టీ నేతలకు కోడ్ వర్తించదా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

## హెటెరో ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలి

**మునగపాక:** నక్కపల్లిలోని హెటెరో డ్రగ్స్ కంపెనీలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫార్మా కంపెనీల యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. హెటెరో డ్రగ్స్ కంపెనీలో తాజాగా అస్వస్థతకు గురైన 12 మంది కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. అలాగే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫార్మా పరిశ్రమల్లో కార్మికుల భద్రతను యాజమాన్యాలు గాలికి వదిలేస్తున్నాయని ఆరోపించారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ఇటువంటి తప్పిదాలు ముందు జరగకుండా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు.